ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

బుధవారం 15 అక్టోబరు 2025

కాల్‌బాయ్ వ్యాపారం ముసుగులో సైబర్ నేరాలు

- అమ్మాయి ఫొటోతో ఫేస్‌బుక్ ఖాతా
- రైస్ మిల్ నిర్వాహకుడిని బెదిరించి రూ.కోటి కాజేత
- సంపాదించినదంతా క్రికెట్ బెట్టింగ్‌లో సమర్పణ

6లో..

తెనాలిలో పట్టపగలు దారుణ హత్య



ఆధార్‌తోనే.. యూరియా

- విచ్చలవిడి వినియోగానికి బ్రేకులు
- పైలెట్ ప్రాజెక్టుగా పెదకాకాని ఎంపిక
- ఎరువుల పంపిణీకి ఆధార్ అనుసంధానం
- ఎంత వాడాలో అంతే.. సాగుదారుడికే పంపిణీ

(గుంటూరు సిటీ, ఆంధ్రజ్యోతి)

యూరియా ఇష్టం వచ్చినట్లు వాడొద్దు.. ఇది పర్యావరణాన్ని విషతుల్యంగా మారుస్తోంది.. భూమి ఆరోగ్యాన్ని గుల్లచేస్తోంది.. అని వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఇటు పర్యావరణ వేత్తలు వేడుకుంటున్నా రైతులు పట్టించుకోవడంలేదు. ఏ పంటకు ఏ సమయంలో ఎంత యూరియా వాడాలో వ్యవసాయ శాఖ రైతులకు చెబుతున్నా పెడచెవిన పెడుతున్నారు. దిగుబడులు భారీగా పెరుగుతాయని ఇష్టం వచ్చినట్లుగా యూరియా, ఎరువులను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఏస్థాయికి వెళ్లిందంటే ప్రభుత్వం భారీగా యూరియా సరఫరా చేస్తున్నా అది సరిపోవడం లేదు. ఎక్కడ చూసినా యూరియా కొరత కనిపిస్తోంది. ప్రభుత్వంపై సబ్సిడీల భారంతో పాటు నేలతల్లి ఆరోగ్యానికి తూట్లు పొడుస్తున్న యూరియా వాడకానికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నూతన విధానాన్ని తెచ్చింది. ఆధార్‌ను అనుసంధానం చేసి ఓటీపీ ద్వారా యూరియా పంపిణీ చేయాలని, అది ఎవరికి.. ఎంత అవసరమో అంతమేర పంపిణీకి నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది. తద్వారా యూరియా విచ్చలవిడి వినియోగానికి చెక్ పెట్టనున్నది. కొరతను నివారించి బ్లాక్ మార్కెట్‌ను కూడా కట్టడి చేయనున్నది. మార్కెట్‌లో చౌకగా దొరికే ఎరువు యూరియాను రైతులు ఎక్కువగా వినియోగించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి కట్టడికి నడుంబిగించింది.

మూడు దఫాలుగా పంపిణీ

యూరియా విచ్చలవిడి వాడకం నిరోధించే క్రమంలో ఒకసారి కాకుండా మూడు దఫాలుగా పంపిణీ చేయనున్నది. ఉదాహరణకు రబీలో వరికి ఎకరాకు 284 కేజీల యూరియా, పత్తికి 245 కేజీల మాత్రమే వినియోగించాలని వ్యవసాయ శాఖ చెబుతుంది. వ్యవసాయ శాఖ చెబుతున్న లెక్కల ప్రకారం ఒక ఎకరా వరి సాగుకు మొదటి విడత 157 కేజీలు, రెండో విడత 127 కేజీల యూరియా మాత్రమే వేయాలి. ఈ ప్రకారమే రైతుకు వేర్వేరుగా యూరియా నిల్వలను అందజేయాలని అధికారులు నిర్ణయించారు. దీనివల్ల యూరియా అధిక వినియోగం అరికట్టవచ్చని ప్రభుత్వం చెబుతుంది.

నూతన విధానం ఇలా..

వెబ్ ల్యాండ్‌తో ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. యూరియా పంపిణీకి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానంలో భాగంగా ప్రతి రైతు వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. యూరియా కోసం రైతు సేవా కేంద్రానికి వస్తే ఆధార్ ఆధారంగా రైతు వివరాలు పరిశీలిస్తారు. ఆ తర్వాత ఆధార్‌కు అనుసంధానం అయిన రైతు ఫోన్ నెంబర్‌కు ఓటీపీ పంపుతారు. ఓటీపీ చెప్పిన తర్వాత రైతు పంట సాగుకు సంబంధించిన వివరాలు అందుబాటులోకి వస్తాయి. ఒక వేళ సదరు వ్యక్తి కౌలు రైతు అయితే పొలం యజమాని ఫోన్‌కు ఓటీపీ వెళ్తుంది. పొలం యజమాని ఓటీపీ చెబితే కౌలు రైతుకు కావాల్సిన యూరియా ఇస్తారు. యూరియా తీసుకునే ప్రతీ రైతు సాగు చేస్తున్న పంటకు సంబంధించి వ్యక్తిగత ధ్రువీకరణపత్రం ఇవ్వాల్సి ఉంటుంది.

పెదకాకానిలో కుస్తీ..

యూరియా దుష్పరిణామాలకు అడ్డు కట్ట వేసేందుకు ప్రభుత్వం తీసుకువస్తున్న ఆధార్ అనుసంధాన విధానానికి పెదకాకాని ప్రయోగ శాలగా మారింది. పెదకాకాని-3 రైతు సేవా కేంద్ర (మిగతా 6వ పేజీలో)

ఔషధాలకు.. అమలేది!



ప్రజారోగ్యంతో ముడిపడి ఉన్న ఔషధాల అమ్మకాలపై పర్యవేక్షణ కొరవడింది. చాలా రకాల మందులకు తగ్గిన జీఎస్‌టీ అమలు కావడం లేదు. ఇంకా పాత ఎంఆర్‌పీ ప్రకారమే మందులు విక్రయిస్తున్నారు. సూపర్ జీఎస్‌టీ- సూపర్ సేవింగ్స్ అంటూ అధికార యంత్రాంగం ప్రచారానికే పరిమితమైంది తప్పిస్తే క్షేత్ర స్థాయిలో అమలు చేయించడంలో విఫలమవుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రచార ఆర్భాటానికి ఇచ్చిన ప్రాధాన్యత కొత్త జీఎస్‌టీ ఫలాలను ప్రజలకు అందించే దిశగా చర్యలు తీసుకోలేకపోతున్నారు. జీఎస్‌టీ అమలుపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా పాత ఎంఆర్‌పీలకే విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితి పల్నాడు.. గుంటూరు.. బాపట్ల జిల్లాల్లో కనిపిస్తోంది.

- ఇంకా పాత జీఎస్‌టీతోనే మందుల విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- అడిగితేనే కొత్త జీఎస్‌టీ అమలు
- సూపర్ జీఎస్‌టీ.. సూపర్ సేవింగ్స్ ప్రచారానికే పరిమితం
- క్షేత్రస్థాయిలో కొరవడిన పర్యవేక్షణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

తగ్గిన జీఎస్‌టీ ఫలాలు రోగులకు ఇంకా అందని ద్రాక్ష చందాన మారింది. కొన్ని రకాల మందులకు జీఎస్‌టీ పూర్తిగా రద్దయినా అది అమలుకు నోచుకోవడంలేదు. ఇప్పుడు ప్రతి కుటుంబానికి మందులు ఓ నిత్యావసర వస్తువులా మారాయి. ప్రతి ఇంట్లో వృద్ధులు ఉన్నారు, అలాగే 50 ఏళ్లు పైబడిన వారిలో 50 శాతం మంది అలాగే షుగర్.. బీపీ.. గుండె సంబంధిత వ్యాధిగ్రస్థులు నిత్యం ఔషధాలను వినియోగిస్తారు. జీఎస్‌టీ తగ్గింపుతో ఔషధాల ధరలు తగ్గాయని వినియోగదారులు ఆనంద పడుతుంటే కొందరు దుకాణదారులు వాటిపై పాత జీఎస్‌టీనే అమలు చేస్తూ అధిక ధరలు వసూలు చేస్తున్నారు. ఇదేంటని అడిగిన వారికే తగ్గిన జీఎస్‌టీని అమలు చేస్తున్నారు. కొన్ని కార్పోరేట్ షాపులు కూడా ఇదే పంథాను అవలంబిస్తున్నాయి. అధికారులు జీఎస్‌టీ తగ్గిందని షాపుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయించి చేతులు దులుపుకుంటున్నారు తప్పిస్తే పూర్తి స్థాయిలో అమలుకు చర్యలు తీసుకుంటున్నా దాఖలాలు కనిపించడం లేదు. కొన్ని రకాల మందులకు 12, 18 శాతం జీఎస్‌టీ ఉండేది. ఆయా మందులకు 5 శాతం వరకు ప్రభుత్వం తగ్గించింది. కొన్ని రకాల మందులకు 6.25 శాతం, ఇంకొన్నిటికి 11.02 శాతం ఉంది. గతంలో కొన్ని రకాల మందులకు 12 శాతం, 5 శాతం జీఎస్‌టీ ఉంది. ఈ విభాగాల్లో జీఎస్‌టీని జీరోగా ప్రభుత్వం ప్రకటించింది. ఆయా రకాల మందులకు (మిగతా 6వ పేజీలో)

ప్రచారానికే పరిమితం

జీఎస్‌టీ తగ్గింపు ప్రచారం ఓ పండుగలా ప్రభుత్వాలు నిర్వహిస్తున్నా వాటి ఫలాలు ఇంకా వినియోగదారులకు అందుబాటులోకి రాలేదు. ఒక్కొక్క కుటుంబానికి అంత.. ఇంత ఆదా అయిందని అధికారులు ప్రచారం చేస్తున్నారే తప్ప ఆచరణలో కానరావడంలేదు. పాత జీఎస్‌టీ కింద కొనుగోలు చేసిన మందుల నిల్వలు పూర్తిగా విక్రయించి కొత్త జీఎస్‌టీ అమలులోకి వచ్చిన తర్వాత మందులు కొనుగులు చేసే వరకు వ్యాపారులు పాత ఎంఆర్‌పీ ప్రకారమే విక్రయించనున్నారు. అయితే కొత్త జీఎస్టీ ప్రకారం మందుల విక్రయాలు జరిగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, మందుల ధరలు తగ్గించాలని రోగులు కోరుతున్నారు.

పేరుకే.. మాచర్ల రేడియో కేంద్రం

- ఇతర స్టేషన్ల ప్రసారాలకే పరిమితం

మాచర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలో మారుమూల తండాలు, గూడెంలు, గ్రామాలకు సమాచారం అందించేందుకు మాచర్ల పట్టణంలో ఏర్పాటు చేసిన ఆకాశవాణి ఆలిండియా రేడియో



రేడియో కేంద్రం ప్రధాన భవనం

కేంద్రం అసంపూర్తి సేవలను అందిస్తోంది. మావోయిస్టు ప్రభావం అధికంగా ఉన్న రోజుల్లో ప్రజలకు సమాచారం అందించేందుకు రేడియో కేంద్రం ఉపయుక్తంగా ఉంటుందని 20 ఏళ్ల క్రితం అప్పటి పాలకులు కేంద్ర ప్రభుత్వాన్ని మెప్పించి మాచర్లకు రేడియో కేంద్రాన్ని సాధించగలిగారు. శ్రీశైలం రోడ్డులోని కాసు బ్రహ్మానంద రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. జిల్లాలో ఏకైక రేడియో స్టేషన్ ఇదే. 2007లో నిర్మాణం పూర్తి చేసుకొని 103.1 ఫ్రీక్వెన్సీతో ఆకాశవాణి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. స్థానికంగా రూపకల్పన చేసిన కార్యక్రమాలు ప్రసారం అవుతాయని ప్రజలు భావించారు. అయితే ఈ కేంద్రం ఇతర స్టేషన్ల ప్రసారాలకే పరిమితమైంది. పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం జరగకపోవడంతో ఒకరిద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలు రూపొందించడానికి ఉద్దేశించిన పరికరాలు నిరుపయోగంగానే ఉండిపోయాయి. రేడియో కేంద్రం నిర్వహణ, ఉద్యోగులు, సిబ్బంది కోసం నిర్మించిన భవనాలు నిరుపయోగంగానే మిగిలిపోయాయి.

గతమెంతో ఘనకీర్తి..

గతమెంతో ఘనకీర్తి కలిగిన రేడియో ప్రసారాలు నానాటికీ తీసికట్టుగా మారాయి. సరైన కార్యక్రమాలు రూపొందించలేక రాష్ట్రంలోని ముఖ్యమైన రేడియో కేంద్రాలు విజయవాడ, నెల్లూరు, కడప, విశాఖ, తిరుపతి కేంద్రాలు అంతంత మాత్రంగానే పనిచేస్తున్నాయి. ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నా నూతన సిబ్బందిని నియమించడం లేదు. ఆర్థిక కారణాలతో ప్రభుత్వాలు వీటిపై నిర్లక్ష్యం చూపుతున్నాయి. ఇలానే కొనసాగితే భవిష్యత్తులో రేడియో కేంద్రాలు మూతపడే అవకాశం లేకపోలేదు. రేడియో స్టేషన్ ద్వారా వెలువడే ప్రసారాలు ప్రజలకు అనేక రకాల సమాచారాన్ని, వినోదం, విజ్ఞానం అందించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో సమాచారం అందిస్తాయి. అలాగే స్థానిక కళాకారులు, విద్యార్థులు, మేధావులతో వివిధ కార్యక్రమాలను నిర్వహించి వారిలోని సృజనాత్మకతను వెలికి తీయవచ్చు. ఈ కోణంలో ప్రభుత్వం దృష్టి సారించి రేడియో కేంద్రాలను తీ ర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.



సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన క్వార్టర్స్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు

బిల్లులపై లాట్ నెంబర్ తప్పనిసరి

జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇచ్చే బిల్లులపై తప్పనిసరిగా లాట్ నెంబర్ వేయాలని జిల్లా వ్యవసాయ అధి కారి ఎం.జగ్గారావు తెలిపారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో విత్తన డీలర్లతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి విత్తన స్టాక్ రిపోర్టు అందజేయాలన్నారు. విత్తన చట్టానికి లోబడి డీలర్లు వ్యాపారం నిర్వహించాలని తెలిపారు. విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్య క్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు హనుమంతరావు, శ్రీనివా సరావు, ఏవో ఐ.శాంతి పాల్గొన్నారు.

శనగ విత్తనాల సరఫరా

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

జిల్లాలో ఈ నెల చివరి వారంలో శనగసాగు ప్రారంభం అవుతుందని, రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు తెలిపారు. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన శనగసాగు ఎలా అనే వార్తపై ఆయన స్పందించారు. ఏపీసీడ్స్ ద్వారా విత్తనాలు సరఫరా అవుతాయని, వాటిని రైతులకు అందజేస్తామన్నారు.

త్వరలో అచ్చంపేటలో స్కిల్ డెవలప్‌మెంట్

- రాష్ట్రంలో మూడు సెంటర్లలో పల్నాడుకు ఒకటి

అచ్చంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ లింగేశ్వరరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కాకినాడ, అమలాపురం, కడప, పల్నాడు జిల్లాలకు ఒక్కొక్క సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయిం చింది. ఇందులో పల్నాడు జిల్లాకు మంజూరైన సెంటర్‌ను అచ్చంపేటలో ఏర్పాటు చేస్తామన్నా రు. ఆయన వెంట ఎంఈవో ఏకుల ప్రసాదరావు, గణేష్, ఏఈ శ్రీనివాసరావు, సీహెచ్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి

ఆనంద దీపావళే లక్ష్యం

- భద్రతా కమిటీ సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా.. అన్ని జాగ్రత్తలు పాటిస్తూ దీపావళి పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందంగా, ఆహ్లాదకరంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. దీపావళి పండుగ రానున్న నేపథ్యంలో, బాణసంచా షాపుల అనుమతులు, భద్రతా చర్యలు, నిబంధనల పాటింపు తదితర అంశాలపై, ఎస్పీ కృష్ణారావుతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. ప్రతి ఒక్కరూ లైసెన్సు తీసుకోవాలని, భద్రతా సూచనలు పాటించాలని దుకాణదారులకు సూచించారు. నిబం ధనలను ఉల్లంఘించే షాపులను సీజ్ చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టాళ్లలోనే బాణ సంచా కొనుగోలు చేయాలన్నారు. ఆర్డీవోలు బాణసంచా తయారీ గోడౌన్లను, దుకాణాలను పరిశీ లించాలన్నారు. తమ పరిధిలో లైసెన్స్ ఇచ్చే ముందు షాపుల వారితో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు ఇవ్వాలని ఆదేశించారు. విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రజలు దీపావళి పండుగను సంతోషంగా, సురక్షితంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సురక్షిత చర్యలు చేపట్టాలి : ఎస్పీ కృష్ణారావు

బాణసంచా విక్రయ దుకాణదారులు రక్షణ పరమైన జాగ్రత్తలు తీసుకొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ కృష్ణారావు ఆదేశించారు, పట్టణాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దీపావళి పండుగ నిర్వహించుకోవాలని టపాకాయల విక్రయదారుల కమిటీ సభ్యులకు సూచించారు.



సమావేశంలో కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ కృష్ణారావు, డీఆర్వో మురళీ

పల్నాడును గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

పల్నాడును గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలలో ఈగల్ టీం లను ఏర్పాటు చేసి మాదక ద్రవ్య వినియోగం వలన కలిగే నష్టాలను గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో నిషేధిత మాదకద్రవ్యాల వినియోగం, అమ్మకాలపై కేసులు నమోదు చేయాలన్నారు. పాఠశాలల్లో డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని శాఖలు పోలీసు శాఖకు సహాయ సహకారాలు అందించాలని తెలిపారు.

ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గుర్తించిన గంజాయి హాట్‌స్పాట్‌లపై పోలీసులు నిఘా ఏర్పాటు చేశామన్నారు. మాదక ద్రవ్యాల సంబంధిత కార్యకలాపాల్లో ఉన్న అనుమానిత వ్యక్తుల నివాస ప్రాంతాలను అధికారులు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఏరియా హాస్పిటల్ నందు ఉన్న డీ-అడిక్షన్ సెంటర్, కొత్తగా ఏర్పాటైన డీ-అడిక్షన్ సెంటర్ నందు అవసరమైన సిబ్బందిని నియమించాలని డీఎంహెచ్‌ఓను కోరారు.

ఎయిడ్స్ నియంత్రణపై నిర్దేశించిన లక్ష్యాలకు చేరుకోవాలి

జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కొరకు నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఎయిడ్స్ నియంత్రణ చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. డాక్టర్ మాధవి లత మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కొరకు పరీక్షలు పెంచాలని, ఆంధ్ర ప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని, హెచ్ఐవి నిర్ధారణ జరిగిన ప్రతి ఒక్కరిని ఏఆర్‌టీ సెంటర్‌కు లింకు చేయాలని సూచించారు. అర్హత ఉన్న ప్రతి రోగిని పెన్షన్‌కు దరఖాస్తు చేసేలా చూడాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం చేసేదెలా?

- పాఠశాలలో గదుల నిర్మాణంలో జాప్యం
- బేస్‌మెంట్ దశలోనే నిలిచిపోయిన నిర్మాణాలు

యడ్లపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రమైన వాతావరణంలో.. ప్రత్యేక గదిలో వంట తయారు చేసి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి.. అని అధికారులు సూచిస్తున్నారు. అయితే జిల్లాలో పలు ప్రాంతాల్లో వంట గదుల నిర్మాణాల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. దీంతో పాఠశాల పరిసరాల్లో అవకాశం ఉన్నదగ్గర వంట తయారు చేస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో తయారవుతున్న వంటతో విద్యార్థులు తరచూ అనారోగ్యాలకు గురవుతున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు రెండో దశలో వంట గదుల నిర్మాణానికి అనుమతులు లభించాయి. ఒక్కో వంట గది నిర్మాణానికి రూ.2.61 లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేసి తొలివిడతలో రూ.52 వేలు చొప్పున నిధులు విడుదల చేశారు. మంజూరైన నిధులతో నిర్మాణాలు ప్రారంభించిన పాఠశాల యాజమాన్య కమిటీలు మార్చి 2024 నాటికి బేస్‌మెంట్ పనులను పూర్తి చేశాయి. బేస్‌మెంట్ పూర్తయ్యే సమయానికి విడుదలైన నిధులు అయిపోవడంతో పాటు ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకాన్ని మన బడి.. మన భవిష్యత్‌గా మార్చింది.అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా నిర్మాణాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోలేదు.



మెట్ల మార్గం దిగువున వంట చేస్తున్న నిర్వాహకులు

యడ్లపాడులో ఇబ్బందులు

యడ్లపాడులోని జడ్పీ ఉన్నత, మండల పరిషత్ హిందూ ప్రాథమిక పాఠశాలల్లో వంట గదులు లేవు. హై స్కూల్‌లో తరగతి గదుల మధ్య మెట్ల మార్గం కిందనే వంట తయారు చేస్తుండగా ప్రాథమిక పాఠశాల నిర్వాహకులు ఇంటి వద్దనే తయారు చేసి, తీసుకొచ్చి వడ్డిస్తున్నారు. హైస్కూల్‌లో ఇంటర్మీడియట్ తరగతులు కూడా నిర్వహిస్తుండడంతో గదుల కొరతతో మధ్యాహ్న భోజన బియ్యం, పప్పులు, నూనెలు హెచ్‌ఎం గదిలోనే నిల్వ చేస్తున్నారు.



యడ్లపాడు జడ్పీ హైస్కూల్‌లో బేస్‌మెంట్ దశలోనే నిలిచిపోయిన వంట గది



యడ్లపాడు మండల పరిషత్ హిందూ ప్రాథమిక పాఠశాలలో నిలిచిన వంట గది

గూగుల్ టెక్ సంస్థ రావడం శుభపరిణామం

-ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖకు రావడం రాష్ట్రానికి శుభపరిణామమని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ఉమ్మడి రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలను తీసుకొచ్చి హైదరాబాద్‌ను ఏ విధంగా అభివృద్ధి చేశారో ఇప్పుడు విశాఖకు గూగుల్‌ను తీసుకొచ్చి రాష్ట్ర ముఖచిత్రాన్నే మార్చనున్నారని కొనియాడారు. రాష్ట్రానికి గూగుల్, టీసీఎస్, యాక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు వస్తున్నాయని, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ఆయన సమర్థవంతమైన నాయకత్వానికి తార్కాణమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో వచ్చిన పెట్టుబడులు కంటే కూటమి ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల్లో వచ్చిన పెట్టుబడులే అధికంగా ఉన్నాయన్నారు. రాష్ట్రానికి రూ. 11.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, 9.5 లక్షల ఉద్యోగావకాశాలు లభించాయని చెప్పారు. గూగుల్ కంపెనీ రాకతో యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందనున్నాయని యరపతినేని పేర్కొన్నారు.

కాల్ బాయ్ వ్యాపారం ముసుగులో సైబర్ నేరాలు

- అమ్మాయి ఫొటోతో ఫేస్‌బుక్ ఖాతా
- రైస్ మిల్ నిర్వాహకుడిని బెదిరించి రూ.కోటి కాజేత
- సంపాదించినదంతా క్రికెట్ బెట్టింగ్‌లో సమర్పణ

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాల్ బాయ్ వ్యాపారం ముసుగులో సైబర్ నేరాలకు పాల్పడుతోన్న బాపట్ల జిల్లా ఇంకొల్లుకు చెందిన చోడ చైతన్య కృష్ణ పవన్ (27) అనే నిందితుడిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు మంగళవారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ నిందితుడిని మీడియా ఎదుట హాజరుపరచి వివరాలు వెల్లడించారు. గుంటూరులోని ఎస్‌వీఎన్ కాలనీకి చెందిన ఓ రైస్‌మిల్ నిర్వాహకుడికి ఆరు నెలల కిందట ఫేస్‌బుక్ మెసెంజర్‌లో శైలజ మార్ని పేరుతో నిందితుడు హాయ్ అని మెసేజ్ పెట్టాడు. కాల్ బాయ్‌గా వెళ్తే డబ్బులు వస్తాయని నిందితుడు చెప్పగా అందుకు బాధితుడు తన వయసు 68 సంవత్సరాలని, తనకు ఇష్టం లేదని స్పందించాడు. చివరకు బాధితునితో మాటలు కలిపి అతని పూర్తి వివరాలు తెలుసుకున్నాడు. కొద్దిరోజుల తర్వాత వేరే నంబర్‌తో ఫోన్లు చేసి తాము పోలీసులమనీ, నువ్వు మహిళలతో అసభ్యంగా చాట్ చేస్తున్నట్లు నీ మీద కేసు నమోదయిందని చెప్పాడు. కేసు నుంచి తప్పించడానికి డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని బెదిరించాడు. అలాగే మరో నంబర్‌తో బాధితుడుకి ఫోన్ చేసి తాము ఆదాయపన్నుశాఖ అధికారులమని, రైస్ మిల్లుపై రైడ్ చేయడానికి వస్తున్నామని చెప్పాడు. రైడ్ చేయకుండా ఉండాలంటే డబ్బులివ్వాలని బెదిరించాడు. ఇలా బెదిరించి అనేక దఫాలుగా బాధితుడిని భయపెట్టి రూ.కోటి వరకు కాజేశాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా సాంకేతిక ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతడి వద్ద నుంచి ఐ ఫోన్‌తో సహా రెండు సెల్ ఫోన్‌లు, నాలుగు సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. కాగా బాధితుడు కొట్టేసిన నగదును ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టాడని చెప్పారు. బిహార్, యూపీ తదితర రాష్ట్రాల్లో అమాయకుల పేరుతో తప్పుడు ఖాతాలు సృష్టించి క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారని, వాటిపై కూడా దృష్టి సారించి సొత్తు రికవరీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన సందేశాలు, స్నేహ అభ్యర్థనలు మొదలైన వాటికి స్పందించవద్దని ఎస్పీ సూచించారు. ఏదైనా అనుమానంగా ఉన్నా, ఎవరైనా బెదిరింపులకు పాల్పడుతున్నా వెంటనే దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో గానీ, డయల్ 112 లేదా 1930 నంబర్లకు గానీ సంప్రదించాలని ఎస్పీ సూచించారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన పట్టాభిపురం సీఐ గంగా.వెంకటేశ్వర్లు, ఎస్సై రాజ్ కుమార్, ట్రైనీ ఎస్సై ప్రదీప్, హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావును, ఐటీ కోర్ సీఐ నిస్సార్ బాషా, హెడ్ కానిస్టేబుల్ రాజా కిషోర్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించి వారికి ప్రశంసాపత్రాలు అందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఏవోలు సిబ్బందికి మార్గదర్శకంగా ఉండాలి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా
- ఉమ్మడి జిల్లాలో 11 మందికి పదోన్నతులు



ఏవోగా పదోన్నతి పొందిన కూచిపూడి మోహనరావుకు ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ చైర్ పర్సన్ క్రిస్టీనా, సీఈవో జ్యోతి బసు, డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో)లు కింది స్థాయి సిబ్బందికి మార్గదర్శకంగా ఉండాలని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. సమయపాలన పాటించటంతో పాటు, పెండింగ్ ఫైళ్ల పరిష్కారంలో ముందుండాలని పిలుపునిచ్చారు. మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలోని 11 మంది సీనియర్ అసిస్టెంట్‌లకు ఏవోలుగా ప్రమోషన్ ఉత్తర్వులు అందజేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీనియర్ అసిస్టెంట్‌లకు ఏవోగా పదోన్నతి అంటే మరింత బాధ్యత పెరిగినట్లేనన్నారు. అనంతరం జిల్లా పరిషత్ సీఈవో వీర్ల జ్యోతి బసు మాట్లాడుతూ ఏవోలు అవసరమయితే ఎంపీడీవో బాధ్యతలు కూడా నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ మాట్లాడుతూ ఏవోలు మండల పరిషత్‌పై పట్టు సాధించాలని, లేకుంటే కిందిస్థాయి సిబ్బంది మాట వినరన్నారు. అనంతరం 11 మంది సీనియర్ అసిస్టెంట్‌లకు ఏవోలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ మినిస్టీరియల్ సిబ్బంది రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ కూచిపూడి మోహన్‌రావు, అకౌంట్స్ ఆఫీసర్ శామ్యూ ల్‌పాల్, ఏవోలు పూర్ణ చంద్రా రెడ్డి, రాజా రత్నం, మల్లేశ్వరరావు, సీసీ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

30 మందికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మరో 30 మంది సీనియర్ అసిస్టెంట్‌లకు డిప్యూటీ ఎంపీ డీవోలుగా పదోన్నతి లభించే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రక్రియను ఈ నెల 17 నాటికి పూర్తిచేయాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశించడంతో అర్హులైన వారి జాబితాను జిల్లా అధికారులు సిద్ధం చేస్తున్నారు.

ఆడవాళ్లందరూ తాగుబోతులే..!

- వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా వివాదాస్పద వ్యాఖ్యలు

వినుకొండ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): "ఆడవాళ్లందరూ మందు తాగుతూ వారి ప్రవర్తనను ప్రపంచానికి తెలియజేస్తున్నారు. ప్రజలూ తెలుసుకుంటున్నారు."అంటూ వినుకొండ వైసీపీ మాజీఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నకిలీ మద్యాన్ని అరికట్టాలంటూ వైసీపీ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం వినుకొండలో ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ విధంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. బొల్లా మహిళలను తాగుబోతులంటూ కించపరచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలపై దిగజారుడు వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటని ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. బ్రహ్మనాయుడు వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని ఆయన తక్షణమే మహిళాలోకానికి క్షమాపణ చెప్పాలని, లేకుంటే మహిళా కమిషన్ విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. బొల్లా బ్రహ్మనాయుడి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం టీడీపీ నాయకులు, మహిళలు వినుకొండలో నిరసన వ్యక్తం చేశారు. బొల్లా బ్రహ్మనాయుడి ఫ్లెక్సీకి చెప్పుల దండ వేసి, ఆయనకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించి పెద్దఎత్తున నినదించారు. మహిళల గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన బొల్లాను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్రహ్మనాయుడు తన అనుచిత వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకొని మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షకీలా, తెలుగు మహిళలు, జనసేన వీర మహిళలు, బీజేపీ మహిళా నాయకులు పాల్గొన్నారు.



బొల్లా బ్రహ్మనాయుడు ఫ్లెక్సీకి చెప్పులు దండ వేసి నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

తెనాలిలో పట్టపగలు దారుణ హత్య

- మాస్క్‌తో స్కూటీపై వచ్చి కత్తితో దాడి చేసి పరార్
- కుటుంబ కలహాలే కారణమని పోలీసుల అనుమానం
- నిందితుడి కోసం గాలింపు

తెనాలి క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తెనాలిలోని చెంచుపేటలో పట్టపగలే దారుణ హత్య జరిగింది. కొబ్బరికాయల కత్తితో జూటూరి తిరుపతిరావు అలియాస్ బుజ్జి (60) అనే వ్యక్తిని దారుణంగా నరికి చంపాడో దుండగుడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తు న్నారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, అమృతలూరు మండలం కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన జూటూరి తిరుపతిరావు అలియాస్ బుజ్జి కొన్ని రోజులుగా చెంచుపేటలోని తన పెద్ద కుమార్తె ఇంటి వద్ద ఉంటున్నారు. గ్రామంలో 10 ఎకరాలకు పైగా కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించే తిరుపతిరావు, పెదపూడి కో-ఆపరేటివ్ సొసైటీలో డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయనకు భార్య ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. మంగళవారం ఉదయం పెద్ద కుమార్తె దుర్గ ఇంటి నుంచి టిఫిన్ తినడానికి బయటకు వచ్చిన తిరుపతిరావును స్కూటీపై మాస్క్ ధరించి వచ్చిన ఓ వ్యక్తి కొబ్బరికాయల కత్తితో నరికి పారిపోయాడు. పట్టపగలు రద్దీగా ఉన్న చోట హత్యకు పాల్పడటంతో ఆ ప్రాంతంలో ఉన్నవారు నిర్ఘాంతపోయారు. సమాచారం అందుకున్న డీఎస్పీ జనార్ధనరావు, సీఐ సాంబశివరావు, పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి స్కూటీపై వెళుతున్న అనుమానాస్పద వ్యక్తిని గుర్తించారు. హతుని బంధువైన గండికోట వెంకటసుబ్బారావు పోలికలు ఉన్న వ్యక్తిగా బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. నిందితుడి కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.



సంఘటన జరిగినప్రదేశం (ఇన్‌సెట్లో) మృతుడు తిరుపతిరావు (ఫైల్‌ఫొటో)

56,332 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 57,430 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 56,332 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 13,955 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	15200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	10500	14000	నెంబరు. 5	10000	14500
341	10000	15500	341	10000	15600
4884	----	----	4884	10000	14000
సూపర్ 10	----	----	సూపర్ 10	10000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15200	తేజ	10000	15000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10500	15800	దేవనూరు డీలక్స్	10500	14700
దేవనూరు డీలక్స్	10000	14800	తాలుకాయలు	5000	8000

గూగుల్‌తో ఒప్పందం కొత్త మైలురాయి : కొమ్మాలపాటి

నరసరావుపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గూగుల్‌తో కుదుర్చుకున్న ఎంవోయూ రాష్ట్ర సాంకేతిక అభివృద్ధిలో కొత్త మైలురాయిగా నిలుస్తుందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేశ్ దూరదృష్టి వల్లే ప్రపంచ దిగ్గజ సంస్థలు రాష్ట్రం వైపు అడుగులు వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. గూగుల్ భాగస్వామ్యంతో రాష్ట్ర యువతకు ఐటీ రంగంలో వేలాదిగా ఉద్యోగాలు వస్తాయని అన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతి, కర్నూలు వంటి నగరాలు ఐటీ హబ్బులుగా మారేందుకు ఇది దోహదం చేస్తుందన్నారు. ప్రపంచస్థాయి సాంకేతిక శిక్షణ కేంద్రాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సెక్యూరిటీ రంగాలలో శిక్షణా అవకాశాలు ఏర్పడతాయని వివరించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ యువతకు గ్లోబల్ స్థాయి పోటీ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని అన్నారు. ఈ ఒప్పందం ద్వారా ప్రతి గ్రామానికి డిజిటల్ సదుపాయాలు విస్తరించనున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టెక్ హబ్‌గా మారే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్ర ప్రగతికి తోడ్పడాలని కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపునిచ్చారు.

ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశం కోసం ఐదవ విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సహాయ సంచాలకులు బీఎస్ఎస్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 17వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 10వ తరగతి మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, టీసీ, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఫోన్ నంబర్, నివాస అడ్రస్ తదితర వివరాలతో కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఐటిఐ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలు కోసం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

గూగుల్ డేటా సెంటర్‌తో కొత్త అధ్యాయం

- యువతకు ప్రపంచస్థాయిలో ఉద్యోగావకాశాలు ● చీఫ్ విప్ జీవీ

వినుకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్రంగా రూ.87,250 కోట్లతో గూగుల్ ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్‌తో రాష్ట్రాభివృద్ధిలో కొత్త అధ్యాయం మొదలైందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గూగుల్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక ఐటీ దిగ్గజ సంస్థలు విశాఖను ఎంపిక చేసుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. ఇది కూటమి ప్రభుత్వానికి, రాష్ట్రానికి లభిస్తున్న గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. మంగళవారం వినుకొండలో విలేకరులతో జీవీ మాట్లాడుతూ బ్రాండ్ ఏపీకి పెట్టుబడిదారులే ప్రచారకర్తలన్న విషయాన్ని సీఎం చంద్రబాబు మరోసారి నిజం చేసి చూపించారన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్, గూగుల్, యాక్సెంచర్, సిఫీ, సత్వా, డబ్ల్యూఎన్ఎస్ లాంటి ప్రముఖ సంస్థలతో విశాఖ రూపురేఖలు మారబోతున్నాయని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా రాష్ట్రంలో కొత్త అధ్యాయం మొదలైందని, యువతకు పెద్దసంఖ్యలో ఉద్యోగావకాశాలు, భారీ పెట్టుబడులు, అత్యాధునిక టెక్నాలజీతో వ్యాపార వాతావరణం ఏర్పడనుందని పేర్కొన్నారు. 2029 నాటికి ఒక్క ఐటీ రంగంలోనే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. చంద్రబాబు, లోకేశ్ శ్రమ, సమర్థత, నిబద్ధత వల్లే గూగుల్ ఒప్పందం ద్వారా దేశ చరిత్రలోనే అతిపెద్ద సింగిల్ ఎఫ్‌డీఐ సాధించామని పేర్కొన్నారు.

నకిలీ మద్యానికి తల్లి వేరు జగనే

- ఆ వృక్షాన్ని కూకటివేళ్లతో పీకేస్తాం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వెలుగుచూసిన కల్తీ మద్యమనే మహావృక్షానికి తల్లివేరు జగన్ అయితే దాని పిల్లవేర్లు, ప్రధాన కొమ్మలు వైసీపీ నేతలు, వారికి సహకరించిన అధికారులని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. కూటమి ప్రభుత్వం ఆ పిచ్చి వృక్షాన్ని కూకటివేళ్లతో సహా పెకలివేస్తుందని స్పష్టం చేశారు. ఏపీలో మొదలైన కల్తీమద్యం మూలాలు ఆఫ్రికా ఖండానికి చేర్చింది జగన్ క్రిమినల్ బుర్రేనని, కల్తీమద్యం ఘటనపై చంద్రబాబు నలుగురు ఐపీఎస్‌లతో సిట్ ఏర్పాటుచేసి, పాత్రధారులు, సూత్రధారుల వెన్నులో వణుకు పుట్టిస్తున్నారని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో మల్లాది విష్ణు బార్‌లో కల్తీమద్యానికి ఆరుగురు చనిపోయారని, అయినా అతన్ని పార్టీ నుంచి జగన్ సస్పెండ్ చేయలేదని అన్నారు. కాకాణి గోవర్ధన్ రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కల్తీమద్యంతో కావలిలో ఐదుగురిని బలితీసుకున్నా, వందలమందిని అనారోగ్యానికి గురిచేసినా జగన్ వారిని పల్లెత్తు మాట అనలేదని పేర్కొన్నారు. తన పాలనలోనే జంగారెడ్డిగూడెంలో కల్తీసారాకు 27 మంది బలైతే, అవన్నీ సహజమరణాలని అసెంబ్లీలో కట్టుకథలు చెప్పిన వ్యక్తి జగనని విమర్శించారు. దొంగ ప్రమాణాలు, బెదిరింపులతో చేసిన తప్పులు ఒప్పుకావనే నిజాన్ని వైసీపీనేత జోగి రమేశ్ గ్రహించాలని హితవు పలికారు.

19న త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార సభ



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార ప్రదాన సభను ఈ నెల 19న నిర్వహించనున్నట్టు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో మంగళవారం సభకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. 2025 ఏడాదికి గాను సుప్రసిద్ధ కవి, సాహితీ విమర్శకుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, రాజకీయ, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు ఈ పురస్కారాలు అందజేయనున్నట్టు వివరించారు. ఈ సభకు ముఖ్య వక్తలుగా ప్రముఖ సాహితీ విమర్శకుడు, కవి, జి.లక్ష్మీనరసయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేశ్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తదితరులు పాల్గొంటారని లక్ష్మణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మూకిరి సుధ, కైలా జయసుధ, బి.విల్సన్ పాల్గొన్నారు.

ఔషధాలకు అమలేది!

(5వ పేజీ తరువాయి)

10.72 శాతం, 4.77 శాతం జీఎస్‌టీ తగ్గింది.

జీఎస్‌టీ తగ్గకముందు కొన్నవి ఉండటంతోనే: దుకాణదారులు

హోల్‌సేల్, రిటైల్ మందుల షాపుల వారు జీఎస్‌టీ తగ్గక ముందే మందులు కొనుగోలు చేశారు. ఆ నిల్వలు వ్యాపారుల వద్ద ఉన్నాయి. ప్రభుత్వం జీఎస్‌టీ తగ్గింపును గత నెల 22 నుంచి అమల్లోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే ఉన్న నిల్వలు తక్కువకు అమ్మితే తాము నష్టపోతామని వ్యాపారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం కొత్త జీఎస్‌టీని అమలు చేయాల్సిందేనని ప్రకటించింది. మందుల కంపెనీలు జీఎస్‌టీ మారకముందు వ్యాపారులకు మందుల సరఫరా చేశాయి. అయితే మందుల ధరలు తగ్గించాలంటే కొనుగోలు చేసిన నిల్వలకు నష్టాన్ని ఎవరు భరిస్తారని దుకాణదారులు ప్రశ్నిస్తున్నారు. రిటైలర్ వద్ద పాత జీఎస్‌టీపై కొనుగోలు చేసిన మందులను తగ్గించి విక్రయిస్తే తాము నష్టపోతామని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆధార్‌తోనే.. యూరియా

(5వ పేజీ తరువాయి)

పరిధిలో 215 మంది రైతులు ఉండగా గత రబీలో ఎక్కువ గా ఏ పంట సాగు చేశారన్న వివరాలు వ్యవసాయ శాఖ దగ్గర అందుబాటులో ఉన్నాయి. ఈ కేంద్రంలో యూరియాను అందు బాటులో ఉంచారు. రబీలో సాగు కోసం సన్నద్ధమైన రైతులను సేవా కేంద్రానికి పిలిపించి ఆధార్ అనుసంధానం, ఓటీపీ వస్తున్న తీరు, యాప్ పని చేస్తున్న విధానంపై అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నారు. అంతేకాక రైతుల నుంచి కూడా అభిప్రాయాలు సేకరిస్తున్నారు. పెదకాకానిలో ఈ విధానం విజయవంతం అయితే వచ్చే ఖరీఫ్‌కి రాష్ట్ర వ్యాప్తంగా ఇదే విధానం ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



విద్యుత్ వినియోగదారుల అదాలత్‌కు విశేష స్పందన


అదాలత్‌ను నిర్వహిస్తున్న విక్టర్ ఇమ్మానుయేల్

మాచర్ల రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల అదాలత్, అవగాహన సదస్సు విశేష స్పందన లభించింది. విజయవాడ ఏపీసీపీడీసీఎల్, సీజీఆర్ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వినియోగదారుల నుంచి వివిధ సమస్యలపై 35 అర్జీలను స్వీకరించారు. ఇందులో 8 సమస్యలను తక్షణమే పరిష్కరించారు. మిగిలిన అర్జీలు 27 సమస్యలు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్స్ తదితర వాటిపై అందాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ పి విజయకుమార్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరరావు, మాచర్ల డీఈఈ ఎన్ సింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల రాజీనామాలకు ఒత్తిడి తేవద్దు

● యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు


విలేకరులతో మాట్లాడుతున్న అంగన్‌వాడీ నేతలు

మాచర్ల రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల చేత బలవంతపు రాజీనామాలు చేయించాలని రాజకీయ నాయకులు ప్రయత్నిస్తున్నారని, చిన్న ఉద్యోగులపై నాయకులు సహృదయంతో వ్యవహరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు మల్లీశ్వరి, అధ్యక్షురాలు లక్ష్మీప్రసన్న, కార్యదర్శి శాంతమణి అన్నారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. డిసెంబర్ 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో షేక్ హజ్రా, జె.జయలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు హరి తదితరులు పాల్గొన్నారు.

గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి దిశగా పయనిస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ యువతకు 20 లక్షల ఉద్యోగాలు లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ రావడంతో అక్కడ సాంకేతిక అభివృద్ధి ఏ స్థాయిలో జరిగిందో అలాగే గూగుల్ క్లౌడ్ ఏపీకి రావడం భవిష్యత్తులో అభివృద్ధికి గేమ్ చేంజర్‌గా మారనుందని స్పష్టం చేశారు. అభివృద్ధి వికేంద్రీకరణ మాటలకే పరిమితం చేయకుండా శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. దేశం మొత్తం గర్వించే సంస్థ రాష్ట్రానికి రావడంపై అందరూ ప్రశంసిస్తుంటే స్వాగతించాల్సింది పోయి గూగుల్ క్లౌడ్ సంస్థపై వైసీపీ నేతలు తప్పుడు ప్రచారం చేసేందుకు కుట్రలు పనుతున్నారని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం : ఎమ్మెల్యే ప్రవీణ్


భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గూగుల్ రాకతో విశాఖపట్నంలో టెక్ విప్లవమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజ సంస్థ గూగుల్‌ను విశాఖపట్నంలో స్థాపించటం నవ్యాంధ్ర ప్రదేశ్‌కు చరిత్రాత్మక ఘట్టమని, రాష్ట్ర అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దూరదృష్టి నాయకత్వానికి నిదర్శనమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మైక్రో సాఫ్ట్ గ్లోబల్ సంస్థలను తీసుకు వచ్చి హైదరాబాద్‌ను ప్రపంచ టెక్‌మ్యాప్‌లో నిలబెట్టిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. నూతన ఆంధ్రప్రదేశ్‌ను టెక్ రాజధానిగా మార్చే దిశగా చంద్రబాబు ముందుకు సాగుతున్నారన్నారు. రూ.87వేల కోట్ల భారీ పెట్టుబడితో సౌత్ ఏషియాలోనే అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ క్లస్టర్ విశాఖలో స్థాపించటం టెక్ రంగానికి గేమ్ చేంజర్ అవుతుందన్నారు. గత ఐదు సంవత్సరాల్లో జరిగిన విధ్వంసక పరిపాలనతో పెట్టుబడిదారులు ముందుకు రాలేదన్నారు. అమరావతిలో క్వాంటం వ్యాలీని ప్రారంభించి విశాఖకు గూగుల్ ను తీసుకురావటం ప్రణాళికా బద్ధమైన అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం విప్లవాత్మక అడుగులు వేస్తుందన్నారు. పెట్టుబడి దారులను అడ్డుకొనేందుకు ఎంత ప్రయత్నాలు చేసినా రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవటం ఎవరి వల్ల కాదన్నారు. ప్రజలతో పాటు పెట్టబడి దారులు కూడా కూటమి పాలనపై నమ్మకంతో ఉన్నారన్నారు.

కల్తీ మద్యంపై వైసీపీ నేతలు మాట్లాడడం విడ్డూరం

● టీడీపీ సీనియర్ నేత యాగంటి


విలేకరులతో మాట్లాడుతున్న యాగంటి

మాచర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యంపై వైసీపీ నేతలు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్‌యార్డు చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో దేశంలో కల్తీ, నాసిరక మద్యాన్ని జే బ్రాండ్ పేరుతో రాష్ట్రంలో విచ్చలవిడిగా ఏరులై పారించారన్నారు. జే బ్రాండ్ నకిలీ మద్యం తాగి రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల మంది మరణించారని యాగంటి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బొట్టు కోటేశ్వరరావు, తిక్కా కొండలు, దుర్భాకుల ప్రసాదరావు, రఫీ, స్వామి, పిన్నంశెట్టి కృష్ణ, శ్యామ రాజపురం బుజ్జి, మస్తాన్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్‌గా జీఎస్టీ 2.0


జీఎస్టీ పై అవగాహన కల్పిస్తున్న టీడీపీ శ్రేణులు

పెదకూరపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్‌గా ఎన్‌డీఏ ప్రభుత్వం జీఎస్టీని తగ్గించి ప్రతి కుటుంబానికి మేలు చేసిందని మాజీ ఎంపీపీ గల్లా బాబూరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావులు అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరు, అబ్బరాజుపాలెం గ్రామాల్లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజలకు, చిరు వ్యాపారులకు జీఎస్టీ పై అవగాహన కరపత్రాలను పంపిణీ చేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, టీడీపీ మండల నాయకులు షేక్ ముంతాజ్, మల్లెల నరసయ్య, ఏటుకూరి అరవింద్, జంగాల ప్రసాదు, గల్లా శివనాగరాజు, మద్దినేని వెంకట సత్యనారాయణ, యన్నం శ్రీనివాసరెడ్డి, జంగాల ప్రసాదు, మునగోటి ధనలక్ష్మి, కొల్లి బ్రహ్మారెడ్డి, జన్నవరపు కోటిరెడ్డి, భాష్యం గోపీ, ఘంటా శ్రీను, రమేష్, కొండవీటి ప్రసాదు పాల్గొన్నారు.



సూపర్ జీఎస్టీపై బైకు ర్యాలీ


బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

వెల్దుర్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై వెల్దుర్తిలో మంగళవారం బైకు ర్యాలీ నిర్వహించారు. అధికారులు, సిబ్బంది నిర్వహించిన బైకు ర్యాలీని ఎంపీడీవో ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు.

ప్రజలపై తగ్గిన భారం

బెల్లంకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్ర ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని, బెల్లంకొండ మండల అధ్యక్షుడు అక్కల వెంకట రామిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మాచాయపాలెంలో జీఎస్టీపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాచాయపాలెం టీడీపీ నాయకుడు గుడిసె కొండయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రంలో జీఎస్టీ తగ్గించటం వల్ల సామాన్యులపై భారం తగ్గిందని తెలిపారు. మాచాయపాలెంలో దుకాణాల వద్దకు వెళ్లి వ్యాపారులు ప్రజలకు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మిశెట్టి సత్యనారాయణ, కమటి చెన్నయ్య, లక్ష్మీనారాయణ, పూర్ణయ్య, రామయ్య, వెంకటరావు, మధుమోహన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి : ఎంపీడీవో

గురజాలటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని గురజాల ఎంపీడీవో గౌసియాబేగం అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆమె పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు అవగాహ కల్పించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా కూడా రోడ్లపై చెత్తాచెదారం ఉండకూడదన్నారు. వర్షాలు కురుస్తున్నందున మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత పచ్చదనంపై శిక్షణ

అమరావతి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్‌లకు థీమ్ 5, పచ్చదనం పరిశుభ్రత, గ్రామ సుస్థిరత అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఒకరోజు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో పార్వతీ, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్పంచులకు శిక్షణ తరగతులు

వెల్దుర్తి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్పంచులు, ఉపసర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. క్లీన్ అండ్ గ్రీన్‌పై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాద్, పంచాయతీ సెక్రటరీలు సిబ్బంది పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 42.47 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులి చింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 74,600 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, మూడు గేట్ల ద్వారా 64,966 క్యూసె క్కుల నీరు, మొత్తం 81,966 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.









బాణసంచా అమ్మకానికి అనుమతులు తప్పనిసరి

● సీఐ భాస్కరరావు



సీఐ భాస్కరరావు

దాచేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళి మందులు అమ్మే వ్యాపారులు ముందుగా పోలీసుశాఖ అనుమతులు, లైసెన్స్‌లు తీసుకోవాలని సీఐ భాస్కరరావు తెలిపారు. మంగళవారం దాచేపల్లి పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ భాస్కరరావు మాట్లాడుతూ దీపావళి మందులు అమ్మే ప్రదేశాల్లో నీరు, ఇసుక దగ్గర ఉంచు

ఆయుష్మాన్ కార్డుతో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం

క్రోసూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆయుష్మాన్ భారత్ స్మార్ట్ కార్డులతో రూ 5 లక్షల వరకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించబడుతుందని మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు కాంద్రు కాశయ్య, డాక్టర్ మహమ్మద్ షరీఫ్ అన్నారు. మంగళవారం క్రోసూరులో లబ్ది దారులకు ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రెండు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య బీమా పథకాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించటం జరిగిందని తెలిపారు. పూర్తిగా ప్రభుత్వ నిధులతోనే ఈ కార్యక్రమం అమలు చేయబడుతుందన్నారు. ఐదు లక్షల ఆరోగ్య సంరక్షణతో పాటు ఆడ పిల్లలు, మహిళలు, సీనియర్ సిటిజన్‌లకు ప్రాధాన్యం కల్పిస్తార ని, అన్ని రకాల వ్యాధులకు నగదు రహిత, కాగితపు రహిత వైద్యం చేస్తారన్నారు. ఈ పథకం కింద ఆరోగ్య బీమా నెట్ వర్క్‌లను విస్తృతం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్ దుద్దుల యోహాన్, టీడీపీ నాయకులు జుజ్జూరి వెంకటరావు, సయ్యద్ హసాన్, మన్నెం శివయ్య తదిత రులు పాల్గొన్నారు.



ఆయుష్మాన్ భారత్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అమరేశ్వరుడి ఆదాయం రూ.20.07 లక్షలు



భక్తులు సమర్పించిన కానుకలు లెక్కిస్తున్న సేవాసంస్థల సభ్యులు

అమరావతి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్ర మైన బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి దేవస్థానంలో మూడు నెలలకు భక్తుల నుంచి హుండీల ద్వారా రూ.20 లక్షల ఆదాయం లభించింది. మంగళవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన హుండీల లెక్కింపులో భక్తులు సమర్పించిన కానుకలు రూ.19,59,190, అన్నదానం హుండీ ద్వారా రూ.48,809 ఆదా యం లభించింది. లెక్కింపు కార్యక్రమాన్ని కోటప్పకొండ దేవ స్థానం ఏసీ డి.చంద్రశేఖర్, అమరేశ్వర దేవస్థాన సహాయ కమి షనర్ టి.రేఖ పర్యవేక్షించారు. లెక్కింపు కార్యక్రమంలో వివిధ సేవాసంస్థల సభ్యులు, ఎస్‌బీఐ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికులందరూ ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలి

నకరికల్లు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనికి హాజరయ్యే ప్రతి శ్రామికుడు ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీవో జీ ప్రసాదు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆధార్‌తో లింకు కాని ఉపాధి శ్రామికులు నకరికల్లు - 1 సచివాలయంలో, గుండ్లపల్లి - 1 సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలన్నారు. అనంతరం ఈకేవైసీ చేయించు కోవాలన్నారు. ఈకేవైసీ పూర్తి చేయించుకున్న శ్రామికులకు మాత్రమే ఉపాధి పని కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉపాధి శ్రామికులు ఆయా గ్రామాల క్షేత్ర సహాయకులను కలసి ఆధార్ లింకు చేయించుకోవటం, ఈకేవైసీ వంటి ప్రక్రియల్లో పూర్తి చేసుకోవాలన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

సత్తెనపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం తాలూకా సెంటర్లో ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వాహనాలను నిలిపివేసి వారికి జరిమానా విధించారు. వాహనదారులు ప్రతిఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలని సీఐ నాగమల్లేశ్వరరావు అన్నారు. మద్యం తాగి ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని సూచించారు.

నెట్‌వర్క్ ఆస్పత్రుల సమ్మె ప్రభావం

సత్తెనపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ వైద్యసేవలకు సంబంధించి బిల్లు బకాయిలు చెల్లించనందుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రులు చేపట్టిన సమ్మె సత్తెనపల్లి ప్రాంతంలో కూడా కొనసాగుతుంది. కొన్ని ప్రైవేట్ వైద్యశాలల్లో ఎన్‌టీఆర్ వైద్యసేవలు నిలిపివేశారు. ఆరోగ్య మిత్రలు ప్రభుత్వ ఆస్పత్రులకు పంపిస్తున్నారు. సమ్మె ప్రభావం రోగులపై పడకుండా చూస్తున్నారు.

300 మందికి అన్నప్రసాదం పంపిణీ

కారంపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద మంగళవారం శ్రీవాసవీ సేవా అన్న ప్రసాద కమిటి పర్యవేక్షణలో 300 మందికి అన్నదానం నిర్వహించారు. కారంపూడి గ్రామ ఉపసర్పంచ్ సూరె అంకారావు బ్రదర్స్, సూరె ఆంజనేయులు రాములు సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో అన్నప్రసాద కమిటీ ఫౌండర్ భవరిశెట్టి రామారావు, సూరె అరుణ్‌కుమార్, మహిళా కమిటి సభ్యులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● డీఎస్పీ హనుమంతరావు



కోటనెమలిపురి గ్రామంలో విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ హనుమంతరావు

రాజుపాలెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు కోరారు. మంగళవారం మండలంలోని కోటనెమలిపురి గ్రామంలో డీఎస్పీ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సెర్చ్‌లో ముగ్గురు సీఐలు, 64 మంది పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పత్రా లు లేని ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ హనుమంతురావు మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య చిన్నపాటి వివాదం నెలకొంది. ఆ సమస్యను రెవెన్యూ వారి వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా పరిష్కరించుకోవాలని సూచించారు. పిల్లలు ఎవరితో తిరుగుతున్నారు, కాలేజికి వెళుతున్నాడా లేడా అనే విషయాలను క్షుణంగా తెలుసుకోవాలని చెప్పారు. పిల్లలు ఈ మధ్యకాలంలో గంజాయికి అలవాటు అవుతున్నారని దానిని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులకు జాగ్రత్త ఎంతో అవసరమన్నారు. అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడుతూ మీకు ఎలాంటి సమస్య ఉన్నా పోలీసులను సంప్రదించి పరిష్కరించుకోవాలని చెప్పారు.

కౌలు రైతులందరికీ రైతు భరోసా వర్తింప చేయాలి

క్రోసూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులందరికీ పొలం యజమానితో సంబంధం లేకుండా రైతుభరోసా రూ.20 వేలు అందజేయాలని క్రోసూరు మండల కౌలు రైతు సంఘం అధ్యక్షుడు తిమ్మిశెట్టి హనుమంతరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కౌలు రైతులతో కలసి తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. కూటమి తాము అధికారంలోకి వస్తే గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తిస్తామని హామీ ఇచ్చారని, 18 నెలలు కావస్తున్నప్పటికీ ఇంతవరకు చర్యలు తీసుకోక పోవటం శోచనీయమన్నారు. భూమి మీద ఎక్కువ మంది వ్యవసాయం చేసేది పంటలు పండించేది కౌలు రైతులేనని, అటువంటి రైతులను నిర్లక్ష్యం చేయటం దుర్మార్గమని వారు అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కౌలు రైతులకు కూడా రైతుభరోసా రూ.20 వేలు ఇవ్వాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం నాయకులు కుంభా లక్ష్మయ్య, చింతకాయల నరసింహారావు, ఏపూరి వెంకటేశ్వర్లు, కుంభా కోటయ్య, పెరికల శ్రీను తదితరులు వినతిపత్రం సమర్పించిన వారిలో ఉన్నారు.

నానో యూరియా వాడకంతో కాలుష్యం తగ్గుతుంది

● ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు



నానో యూరియా గురించి రైతులకు తెలియజేస్తున్న ఏడీఏ శ్రీ కృష్ణ దేవరాయలు, ఏవో దేవదాసు

నకరికల్లు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : నానో యూరియా వాడకం ద్వారా వాతావరణ కాలుష్యం తగ్గుతుందని పిడుగురాళ్ళ ఏడీఏ బీ శ్రీకృష్ణ దేవరాయలు తెలిపారు. మంగళవారం రూపెనగుంట్ల రైతు సేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఎకరాకు ఐదు వందల ఎంఎల్ నానో యూరియాను, రెండు వందలు నీటికి కలిపి వరి పంట పై పైపాటుగా పిచికారి చేయాలన్నారు. తద్వారా నత్రజని పంట మొక్కలు త్వరగా గ్రహిస్తాయన్నారు. వాతావరణ కాలుష్యం తగ్గుతుందన్నారు. నానో యూరియా ఐదు వందల ఎంఎల్ పూర్తి ఖరీదు రూ 225 అని తెలిపారు. అన్ని పంటలకు పై పాటుగా నానో యూరియాను వాడాలని తెలిపారు. నకరికల్లు, చీమలమర్రి, రూపెనగుంట్ల రైతు సేవా కేంద్రాల ద్వారా 50 టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేసినట్టు తెలిపారు. రైతులందరూ ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

● ఉపాధ్యాయునికి దేహశుద్ధి

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయిడికి దేహశుద్ధి చేసిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన బాలిక గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి చదువుతుంది. అదే పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు సోమవారం పాఠశాలలో విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. జరిగిన విషయాన్ని బాలిక అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులకు వివరించింది. కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు, బంధువులు మంగళవారం పాఠశాలకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని చితక బాదారు. దీంతో గ్రామపెద్దలు, బాలిక తల్లిదండ్రులతో మాట్లాడారు. ఉపాధ్యాయుడిని మందలించి అతడితో విద్యార్థినికి క్షమాపణ చెప్పించారు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న డీవైఈవో ఏసుబాబు హైస్కూల్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామస్థులు సదరు ఉపాధ్యాయుడిపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని, పాఠశాల నుంచి బదిలీ చేయాలని డీవైఈవోను కోరారు. ఐతే ఇటువంటి సంఘటనలు మరలా పునరావృతం కానివ్వ నని సదరు ఉపాధ్యాయుడితో రాతపూర్వక లెటరు తీసుకున్నారు. ఐతే సదరు ఉపాధ్యాయుడు గతంలో కూడా మండలంలోని ఒక జడ్పీ హైస్కూల్లో పని చేస్తూ ఇలాగే అసభ్యకరంగా ప్రవర్తించటంతో అప్పుడు కూడా అతడికి గ్రామస్థులు దేహశుద్ధి చేసినట్టు సమాచారం.

హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అ

మాచర్ల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గత మార్చి నెలలో ఎస్సీ, వడ్డెర సామాజిక వర్గీయులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో పట్టణ పోలీసులు హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న ఒంటిపులి అనిల్‌కుమార్, మంజుల అంజనేయులు, చల్లా వెంకటేశ్వర్లును మంగళవారం గురజాల డీఎస్పీ జగదీష్ పట్టణంలోని రింగురోడ్డు సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. వీరిని పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి నిందితులకు 15 రోజుల పాటు రిమాండ్ విధించి గురజాల సబ్‌జైల్‌కు తరలించారు.

టీడీపీ నేత బుజ్జి మృతి

పిడుగురాళ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 17వ వార్డుకు చెందిన టీడీపీ నేత కొమ్ము బుజ్జి (తాపీ మేస్త్రి) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మృతుడి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టీడీపీ నేతలు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలను అందించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నరసరావుపేటలో వరుస దొంగతనాలతో బెంబేలు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నరసరావుపేట మండలం ఇస్సపాలెంలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. ఇస్సపాలెంకు చెందిన నాగిశెట్టి యువ, భానుప్రకాస్ దంపతులు తమిళనాడులోని అరుణాచలం దైవ దర్శనానికివెళ్ళి ఐదు రోజుల తర్వాత ఇంటికి వచ్చేసరికి ఇంటిలో దాచిపెట్టిన సుమారు 9సవర్ల బంగారం, లక్ష రూపాయల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు. మంగళవారం నరసరావుపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేయగా రూరల్ ఎస్ఐ కిషోర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

భూ కబ్జాపై ఫిర్యాదు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కేశానుపల్లిలో సుమారు కోటి రూపాయల విలువ చేసే గ్రామకంఠం భూమి వైసీపీ నేత కబ్జా చేసినట్లు గ్రామస్థులు మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేశానుపల్లి టీడీపీ నేతలు మాట్లాడుతూ వైసీపీ నేత తాతపూడి దానియేలు 17సెంట్ల గ్రామ కంఠం భూమిని ఆన్‌లైన్‌లో తన భార్య పేరుతో నమోదు చేయించుకుని, తర్వాత తన కొడుకు పేరుతో బదలాయింపు చేసుకుని కబ్జా చేశాడని ఆరోపించారు. భూ కబ్జాకు స్థానిక రెవెన్యూ అధికారులు, సర్వేయర్ సహకరించారని ఆరోపణ చేశారు.

మహిళ అదృశ్యంపై...

శావల్యాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేవాలయానికి వెళ్ళిన మహిళ కనిపించకుండా అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శావల్యాపురం ఏఎస్ఐ షేక్ బాజీ తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ మండలం పిట్టబండ గ్రామానికి చెందిన కర్రి పార్వతి ఈ నెల 7వ తేదీ లక్ష్మీ తిరుపతమ్మ దేవాలయానికి వెళుతున్నానని కుటుంబసభ్యులకు చెప్పి ఇంటికి రాలేదు. వారం రోజులలైనా పార్వతి ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం శావల్యాపురం పోలీస్‌స్టేషన్‌లో పార్వతి భర్త కర్రి నాగేశ్వరరావు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాజీ తెలిపారు. పార్వతి ఆచూకీ తెలిసినవారు శావల్యాపురం పోలీసులకు 08646 259335కు ఫోన్‌చేసి సమాచారం చెప్పవచ్చని ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామానికి చెందిన షేక్ జానీ (35) మృతి చెందాడు. నల్లపాడు పోలీసుల కథనం మేరకు బోయపాలెంకు చెందిన జానీ, ఆయన భార్య రేష్మాబీ ఈ నెల 7న ఏటుకూరు బైపాస్ రోడ్డులోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అప్పటినుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. భార్య రేష్మాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్‌లో వినుకొండ వాసులకు స్థానం

వినుకొండ టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కమిటీలో వినుకొండ ప్రాంత వాసులకు స్థానం దక్కింది. నూతన కమిటీ ఏర్పాటు విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన నూతన కమిటీ ప్రమాణ స్వీకారంలో వినుకొండ ప్రాంతం నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రామావత్ ఏడుకొండలు నాయక్, బాణావత్ రామునాయక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు వివరించారు.

పీఎన్‌సీకేఆర్‌లో సీపీఆర్‌పై అవగాహన

నరసరావుపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఎన్‌సీ, కేఆర్ జానియర్ కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారని జాయింట్ సెక్రటరీ పీ శ్రీనివాసప్రసాదు మంగళవారం తెలిపారు. పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బీ రవి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపాలకృష్ణ, డాక్టర్ ఒన్నూర్ సాహెబ్, ట్రైనర్ తేజశ్వని, ఏ నాగరాజు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో మేలు: నగేష్

యడ్లపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవన ఎరువులతో రైతులకు మేలు కలుగుతుందని ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.నగేష్ అన్నారు. జీవన ఎరువుల ప్రాముఖ్యతా వారోత్సవాలలో భాగంగా యడ్లపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ పీవీ సత్యగోపాల్, ఎంపీడీవో హేమలతాదేవి, అభ్యుదయ రైతులు, గ్రామీణ కృషి అనుభవ పథకం విద్యార్థినులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

ఈపూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అరుంధతి సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఆర్థిక సాయంతోపాటు నిత్యావసరాలను మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని ఊడిజెర్ల ఎస్సీ కాలనీలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వంగల వీరయ్య, పున్నమ్మలకు అరుంధతి సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు దాసరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో 50కేజీల బియ్యం, నిత్యావరాలు, కూరగాయలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సెక్రటరీ కట్టెంపూడి బర్న, శిఖ రామయ్య, కోటేశ్వరరావు, లింగయ్య, బాబు, అప్పయ్య, బ్రహ్మానాయుడు, నంబూరు మోషే పాల్గొన్నారు

క్లీన్, గ్రీన్ గ్రామాలపై శిక్షణ

రొంపిచర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ మస్తాన్‌వలి మంగళవారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో క్లీన్, గ్రీన్ గ్రామాల శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో మాథ్యూబాబు ప్రారంభించారు.



పమిడిపాడులో సాగవుతున్న రొయ్యల చెరువు, ఎగుమతికి సిద్ధం చేసిన చేపలు

విస్తరిస్తున్న ఆక్వా సాగు

● నూజెండ్ల మండలంలో అధికారికంగా వెయ్యి ఎకరాల్లో సాగు

నూజెండ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల మండలంలో పొలం రేట్లు, కౌళ్ళు తక్కువగా ఉండటం, నీటి సౌకర్యం పుష్కలంగా ఉండి 24 గంటల విద్యుత్ అందుబాటులో ఉండంతో ఆక్వా సాగు ప్రతి ఏటా పెరుగుతోంది. పది సంవత్సరాల క్రితం కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వచ్చిన చేపల, రొయ్యల పెంపకం దారులు నూజెండ్ల ప్రాంతంలో పొలాలు కొనుగోలు చేసి చేపలు, రొయ్యల చెరువులు తవ్వించి ఆక్వా సాగు చేపట్టడంతో క్రమేణ ఈ ప్రాంతంలోని రైతులు కూడా వరి పంట లాభదాయకంగా లేకపోవటంతో తక్కువ సారవంతం ఉన్న భూములను చెరువులుగా మార్చారు. మండల కేంద్రం నూజెండ్ల, పమిడిపాడు, వీ అప్పాపురం, తలార్లపల్లి, దాట్లవారిపాలెం, కమ్మవారిపాలెం, పువ్వాడ, రవ్వవరం, తిమ్మాపురం, సుధాకర్‌నగర్, ఉప్పలపాడు, ఐనవోలు, చింతలచెరువు, ముక్కెళ్ళపాడు, నాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో ఆక్వాసాగు విస్తృతంగా చేస్తున్నారు. ప్రతి రోజు చేపలు, రొయ్యలు ఎగుమతులు చేస్తున్నారు. మండలంలోని అధికారిక లెక్కల ప్రకారం వెయ్యి ఎకరాల వరకు 110 మంది రైతులు చెరువులు తవ్వి లైసెన్స్‌లు పొందారు. అదేవిధంగా నూజెండ్ల, చెరుకుంపాలెం మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, పాత చెరుకుంపాలెం, కంభంపాడు, పీ అన్నవరం తదితర గ్రామాల్లో 13 పంచాయతీ చెరువులు ఉన్నాయి. ఊర చెరువుల్లో కూడా చేపల పెంపకం విస్తృతంగా చేస్తున్నారు. కూలీలు అవసరం లేకపోవటం, యజమానులు ఒకరిద్దరు పని వారితోనే చేపలు, రొయ్యలు పెంపకం చేపట్టే వెసులుబాటు ఉండటం, బ్యాంకులు పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వటం ఆక్వాసాగు విస్తరించేందుకు దోహద పడతున్నాయి. నూజెండ్ల ప్రాంతంలో ఇప్పటివరకు వైరెస్ ప్రభావం పెద్దగా లేకపోవటంతో ఏడాదికి రెండు లేక మూడు రొయ్య పంట తీస్తున్నారు. అవకాశం ఉన్న వారు ప్రత్యేక విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేసుకొని 24 గంటలు కరెంటు సదుపాయం ఉండేలా ప్రణాళికా బద్ధంగా ముందుకువెళ్తూ రొయ్యల సాగుపై ఔత్సాహికులను ఆకర్షిస్తోంది. ఇటీవల కాలంలో ఎగుమతులు నిలిచిపోయిన సందర్భంలో కొద్దిరోజులు ఆటుపోటులు ఉన్నా ప్రభుత్వం పోత్సాహం అందించి ఈ ప్రాంతంలో చేపలు, రొయ్యల ఎగుమతికి ప్రాసెసింగ్ యూనిట్లు, శీతలీకరణ రవాణా వ్యవస్థను ఏర్పాటు చేస్తే తమకు లాభసాటిగా ఉంటుందని ఆక్వా రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య పంటలతో కష్టనష్టాలు ఎదుర్కొంటున్న రైతులు సమగ్ర వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా కొద్ది ఎకరాల్లో చేపల సాగు కూడా వారికి ప్రయోజనకంగా ఉంటుందని అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

పేదల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. రాష్ట్రంలో పట్టణ పేదల పేదరిక నిర్మూలనకు కీలకపాత్ర పోషిస్తున్న మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మునిసిపల్ ఏరియాస్ (మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల (గ్రూపులు) ఉత్పత్తుల మార్కెటింగ్‌కు తాత్కాలిక షాపుల నిర్మాణానికి మంగళవారం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలోని ప్లాట్‌ఫాంలకు సంబంధించిన స్థలాలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలించారు. 2007లో స్థాపించబడిన ఈ సంస్థ రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థల్లో స్వయం స్థిరమైన సంస్థలను ప్రోత్సహించడం, బలోపేతం చేయడం, సంరక్షించడం ద్వారా పట్టణ పేదల ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహిస్తోందన్నారు. మెప్మా ద్వారా ఏర్పాటుచేసే ఈ తాత్కాలిక షాపులు స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక స్వావలంబనకు మార్గం సుగమం చేస్తాయన్నారు. నరసరావుపేట పట్టణంలోని ఆరు ప్రాంతాల్లో ఈ స్థలాలు ఎంపిక చేసిన తర్వాత, రోడ్ మార్జిన్‌లలో ప్లాట్‌ఫాంలు నిర్మించి, మెప్మా సభ్యులకు అప్పగించడం జరుగుతుందన్నారు. ఐరన్ కంటైనర్లు, మోడ్యులర్ యూనిట్లతో తాత్కాలిక షాపులు ఏర్పాటుచేసి, గ్రూపులు తమ ఉత్పత్తులను విక్రయించుకోవడానికి అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, మెప్మా సిబ్బంది, స్థానిక గ్రూపు ప్రతినిధులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



గ్రీన్ అంబాసిడర్లతో ఎంపీడీవో పీ ఉమాదేవి

పారిశుధ్యంలో గ్రీన్ అంబాసిడర్ల పాత్ర ముఖ్యమైనది

● ఎంపీడీవో ఉమాదేవి

నూజెండ్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటంలో గ్రీన్ అంబాసిడర్ల పాత్ర చాలా ముఖ్యమైనదని ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సుస్థిర అభివృద్ధి, క్లీన్ అండ్ గ్రీన్ శిక్షణ కార్యక్రమం గ్రీన్ అంబాసిడర్లకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలను చైతన్యపరచి తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లకు చేర్చి వర్మీ కంపోస్టు తయారుచేయటం ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ జెడ్డా సుబ్బులు, రామయ్య, రిసోర్స్‌పర్సన్ ఎస్‌కే రబ్బానీ, హసన్ పీరా, మండల కో-ఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం తయారీపై సీబీఐ దర్యాప్తు చేయాలి: డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ వ్యవహారంపై తక్షణమే సీబీఐ దర్యాపు చేయాలని వైసీపీ జిల్లా కార్యనిర్వహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక గుంటూరు రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రకాష్ నగర్‌లోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నకిలీ మద్యం తయారీ బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణకు ప్రభుత్వం ఆదేశించాలని కోరుతూ ఎక్సైజ్ శాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ 70వేల బెల్టు షాపుల ద్వారా అమ్మకాలు జరిపి సుమారు 48 వేలకోట్ల రూపాయలు అక్రమంగా ఆర్జించారని ఆరోపించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నరసరావుపేటలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న వైసీపీ నాయకులు

మహిళలకు వైద్యపరీక్షలు

శావల్యాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సుచరిత ఎడ్యుకేషనల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో మహిళల కోసం మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నర్సరావుపేటకు చెందిన శ్రేయ నర్సింగ్ హోమ్ సౌజన్యంతో శావల్యాపురం రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీరామ పబ్లిక్ స్కూల్‌లో ఈ వైద్య శిబిరం జరిగింది. సంతానలేమితో బాధపడుతున్న మండలంలోని వివిధ గ్రా మాల నుంచి 50మంది మహిళలు వైద్య శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శ్రేయ నర్సింగ్ హోమ్ వైద్యులు పాల్గొని మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్యంకోసం 20మంది మహిళలను నరసరావుపేటలో ఆసుపత్రికి రావాలని సూచించారు. 20మందికి ఓపీ, స్కానింగ్‌లు ఉచితంగా నిర్వహిస్తామని, ల్యాబ్ పరీక్షలకు 25శాతం రాయితీ ఇస్తామన్నారు. శిబిరాన్ని విజయవంతం చేసిన పాఠశాల కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్, ప్రిన్సిపాల్ రత్నకుమారి తదితరులకు వైద్యులు కృతజ్ఞతలు తెలిపారు.



శావల్యాపురంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు


క్రికెట్ టోర్నమెంట్‌లో ఏఎంరెడ్డి విద్యార్థుల ప్రతిభ



టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టు సభ్యులతో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తదితరులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో ఏఎంరెడ్డి కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ డిప్లొమో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. నరసరావుపేటలోని ఎస్‌కేఆర్‌బీఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఇటీవల ఇలెవన్ 11 క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో ఏఎంరెడ్డి కళాశాల జట్టు ప్రతిభ కనబరచి రన్నర్‌గా నిలిచారన్నారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, పీడీలు ఏ ఇమ్మానుయేల్, కే ఈశ్వర్ ప్రసాద్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

ఈశ్వర్‌లో రీసెర్చ్ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు, పర్పుల్ టెక్నాలజీస్ ప్రతినిధి సుధాకర్, విద్యార్థులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో విజయవాడ పర్పుల్ టెక్నాలజీస్ పీసీబీ డిజైన్ అండ్ అర్డినో అనే అంశంపై వారం రోజుల వర్క్‌షాప్ నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. పర్పుల్ టెక్నాలజీస్ రిసోర్స్ పర్సన్ పీ సుధాకర్ మట్లాడుతూ సాంకేతికత పోటీ ప్రపంచంలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్ డిజైన్ ఎలక్ట్రానిక్ పరికరాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగ మల్లేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, చైర్మన్ షేక్ మీరావలి, ఎగ్జిక్యూటివ్ షేక్ నజీమా, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ షేక్ బషీరా, అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్నాడు బాలోత్సవం గోడపత్రికల ఆవిష్కరణ

శావల్యాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నర్సరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల్లో నవంబరు 29, 30 తేదీల్లో పల్నాడు బాలోత్సవంను ఘనంగా నిర్వహించనున్నట్లు పల్నాడు బాలోత్సవం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు తెలిపారు. శావల్యాపురంలోని జడ్పీ పాఠశాల్లో హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, శ్రీరామ పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్ మంగళవారం బాలోత్సవం గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ బాలోత్సవం కమిటీ ఇన్‌చార్జి బీవీ నాగేశ్వరరావు, బాలోత్సవం కమిటీ సభ్యులు నెల్లూరి బ్రహ్మయ్య, కోట సాయికుమార్‌లు పాల్గొన్నారు.

కనకనారాయణ మృతికి జీవీ సంతాపం

వయ్యకల్లు (శావల్యాపురం) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వయ్యకల్లు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్, ప్రముఖ కళాకారుడు కర్రె కనకనారాయణ మృతికి ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మంగళవారం సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జీవీ మాట్లాడుతూ మాజీ ఉపసర్పంచ్‌గా, టీడీపీ నేతగా కనకనారాయణ గ్రామస్థులకు విశిష్ట సేవలందించారని, కళారంగానికి కనకనారాయణ అందించిన సేవలు మరువలేనివన్నారు. కళాభారతి కల్చరల్ థియేటర్స్ సంస్థను స్థాపించి మార్గదర్శిగా నిలిచారన్నారు. కనకనారాయణ మృతి కళారంగానికి, టీడీపీకి తీరని లోటన్నారు.

చెకుముకి సంబరాల గోడపత్రికల ఆవిష్కరణ

వేల్పూరు (శావల్యాపురం) అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరగనున్న చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా ఈ నెల 18న మండలంలోని ఐదు జడ్పీ పాఠశాలల్లో పాఠశాల స్థాయి సైన్స్ ట్యాలెంట్ టెస్టును నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక శావల్యాపురం మండల కన్వీనర్ జ్యోతి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని వేల్పూరు జడ్పీ పాఠశాలలో చెకుముకి ప్రతిభా పరీక్షకు సంబంధించిన గోడపత్రికలను ఉపాధ్యాయులతో కలసి మంగళవారం ఆయన ఆవిష్కరించారు. మండల కన్వీనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, విజ్ఞానశాస్త్రంపై విద్యార్థులకు ఆసక్తిని పెంచేందుకు సైన్స్ ట్యాలెంట్ టెస్ట్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఉపాధ్యాయులు అబ్దుల్లా, శ్రీనివాసరావు, శివరామకృష్ణ, రఘునాథ బాబు, హరీష, శివకుమారి పాల్గొన్నారు.

ఆర్డీవో వీడియో కాన్ఫరెన్స్

రొంపిచర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆర్డీవో మధులతతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ బండి నిర్మల, వీఆర్‌వోలు పాల్గొన్నారు. మండలంలోని భూమికి సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చొరవ చూపాలని ఆర్డీవో ఆదేశించారు. అదేవిధంగా పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎక్సైజ్ సురక్ష యాప్‌పై అవగాహన కల్పించండి

● కల్తీ మద్యంపై కఠిన చర్యలు ● కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట లీగల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ సురక్ష యాప్‌పై ప్రచారం కల్పించాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా మంగళవారం ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎక్సైజ్ అధికారితో మంగళవారం కలెక్టర్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో కల్తీ మద్యం రావడానికి వీల్లేదని కల్తీ మద్యం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్సైజ్ సురక్ష యాప్‌ను ప్రారంభించిందన్నారు. సదరు యాప్‌పై అవగాహన కల్పించాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మణికంఠకు సూచించారు. జిల్లా ఎక్సైజ్ అధికారి మణికంఠ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా కల్తీ మద్యం లేదన్నారు. కల్తీ మద్యం ద్వారా ఎటువంటి మరణాలు సంభవించలేదన్నారు. ఎవరైనా ఉచితంగా గూగుల్ ప్లే స్టోర్‌లో ఎక్సైజ్ సురక్ష యాప్ ను డౌన్లోడ్ చేసుకోవచ్చన్నారు. ఈ యాప్‌తో మద్యం సీసా నకిలీదా కాదా అని గుర్తించవచ్చన్నారు.

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రాకతో

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుంది

● రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన గూగుల్ సంస్థ డేటా సెంటర్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మంగళవారం అన్నారు. గూగుల్ సెంటర్ ఏర్పాటుకు ఢిల్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎంవోయూ కుదుర్చుకోవడం సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ అంశం అన్నారు. యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ అహరిశ్నలు శ్రమించి, ప్రపంచ ప్రసిద్ధ కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నారన్నారు. దాదాపు 12 నెలలు పాటు శ్రమించి, జాతీయ స్థాయిలో పాలసీలలో కూడా మార్పులు చేయించి, 2 లక్షల మందికి ఉపాధి కల్పించే రూ. లక్ష 33 కోట్ల పెట్టుబడులు పెట్టే గూగుల్ క్లౌడ్ సంస్థను రాష్ట్రానికి తీసుకురావడంలో మంత్రి నారా లోకేశ్, మంత్రి మండలి బృందం కృషి అభినందనీయం అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణను కేవలం మాటలకే పరిమితం కాకుండా, శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

శివకాశీ టూ గుంటూరు

● దీపావళి బాణసంచా అక్రమ రవాణాపై కొరవడిన నిఘా ● కనిపించని అధికారుల తనిఖీలు

గుంటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రానున్న దీపావళికి బాణసంచా విక్రయాలకు కొందరు వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. ఎటువంటి నిబంధనలు పాటించకుండా అక్రమంగా బాణసంచా తీసుకొచ్చి వ్యాపారం చేసి సొమ్ము చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కోట్ల రూపాయల బాణసంచా అక్రమ పద్ధతిలో తరలివస్తోన్నా వాణిజ్యపన్నులశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్న దాఖలాలు కనిపించకపోవటం విమర్శలకు తావిస్తోంది. బాణసంచా తయారీకి కీలక కేంద్రమైన తమిళనాడులోని శివకాశి నుంచి కొందరు వ్యాపారులు భారీ ఎత్తున సరకు రవాణా చేస్తున్నారు. కొందరు అక్రమ పద్ధతిలో మరికొందరు ఎటువంటి బిల్లులు లేకుండానే అనధికారికంగా బాణసంచాను వాహనాలలో గోడౌన్‌లకు తరలిస్తున్నారు. శివకాశి నుంచి నేరుగా ఉమ్మడి గుంటూరు జిల్లాకు బాణసంచా అక్రమ పద్ధతిలో తరలివస్తున్నా వాణిజ్యపన్నులశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మాచర్ల, నరసరావుపేట, సత్తెనపల్లి, అమరావతి, చిలకలూరిపేట, మంగళగిరి, గుంటూరు వంటి ప్రాంతాల్లో బాణసంచా విక్రయ కేంద్రాలు పెద్ద ఎత్తున వెలిశాయి. దీపావళి సందడి మాటున అక్రమ రవాణాలో ఎటువంటి బిల్లులు లేకుండానే కోట్లాది రూపాయల సరుకు రవాణా అవుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



● నిబంధనలు హుష్...!

ఇక బాణసంచా హోల్‌సేల్ విక్రయాల్లో దుకాణదారులు నిబంధనలు పాటించటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పండుగ రోజు విక్రయాలు చేసేందుకు చిల్లర వర్తకులు హోల్‌సేల్ వ్యాపారుల నుంచి బాణసంచా కొనుగోలు చేస్తుంటారు. పండుగ సమీపిస్తుండటంతో ఇప్పటికే పెద్దఎత్తున బాణసంచా కొనుగోలు చేశారు. వారికి ఎంత వరకు బిల్లులు ఇస్తున్నారో తెలియడం లేదు. దీనిపై కనీసం అధికారులు తనిఖీలు చేసిన సందర్భాలు కూడా లేకపోవటం అనేక విమర్శలకు తావిస్తోంది. అయితే బాణసంచా విక్రయాలు 18 శాతం జాబితాలో ఉండటంతో ఆ దిశగా ఎంత వరకు క్రయవిక్రయాలు జరుగుతున్నాయన్న లావాదేవీలపై వాణిజ్యశాఖ అధికారులు దృష్టి సారించాలని వినియోగదారులు కోరుతున్నారు.



గడ్డిపూలు.. కనువిందు

పాలపాడు రహదారిలో చిలకలూరిపేట మేజర్ కాల్వ కట్టపై గడ్డిమొక్కలకు పూసిన పూలు కనువిందు చేస్తున్నాయి. ఈ పూలతో కాల్వ గట్టు తెలుపు వర్ణంతో శోభిల్లుతుంది.

-ఆంధ్రజ్యోతి, నరసరావుపేట

వైద్య కళాశాలకు బస్సు విరాళం

గుంటూరు మెడికల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల సామాజిక వ్యాధి నిరోధక శాస్త్రవిభాగానికి రూ.30 లక్షల విలువైన బస్సును విరాళంగా అందజేసేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎంసీ బ్రాంచ్ ఆమోదం తెలిపింది. మరో వారం రోజుల్లో ఈ బస్సును జీఎంసీకి అందజేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ మాధవి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన శాఖ అధికారులను కలసి వైద్య విద్యార్థుల కోసం బ్యాంక్ తరఫున బస్సును విరాళంగా అందజేయాలని కోరారు. వీరి అభ్యర్థన పట్ల బ్యాంక్ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారు. రూ. 30 లక్షలతో నూతన టాటా స్టార్‌బస్ ప్రైమ్‌ను కొనుగోలు చేశారు. దీనిని త్వరలో ఎస్‌పీఎం విభాగానికి అందజేస్తారు. ఇదే రీతిలో వైద్య కళాశాలలోని గార్డెన్స్‌లో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు కూడా యూనియన్ బ్యాంక్ అధికారులు ఆమోదం తెలిపారు. ప్రభుత్వాసుపత్రి న్యూరాలజీ విభాగంలోని స్లీప్ ల్యాబ్‌లో అవసరమైన రూ.30 లక్షల విలువైన వైద్య పరికరాలను విరాళంగా అందజేసేందుకు మరో బ్యాంక్ ముందుకొచ్చినట్లు తెలిసింది. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద జీఎంసీకి ఈ విరాళం అందజేసేందుకు సదరు బ్యాంక్ అధికారులు ఆమోదం తెలిపినట్లు సమాచారం. కళాశాలకు

● త్వరలో అందజేయనున్న యూనియన్ బ్యాంకు


వచ్చే వయో వృద్ధులు, దివ్యాంగులను దృష్టిలో ఉంచుకొని వారి కోసం ఆవరణలో నడిపేందుకు బగ్గీ వంటి మినీ మోటారు వెహికల్‌ను రూ.4 లక్షల వ్యయంతో కొనుగోలు చేసి విరాళంగా అందజేసేందుకు మరో సంస్థ ముందుకొచ్చింది. కాగా, రూ.40 లక్షల వ్యయంతో వైద్య కళాశాలలో చేపట్టిన క్యాంటీన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ఈ వారంలో దాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారీ తెలిపారు. ఇదిలా ఉంటే వైద్య విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని కళాశాల ఆవరణలోనే కొత్తగా కో ఆపరేటివ్ స్టోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న


వరద ఉధృతి

దిగువకు 1,03,350 క్యూసెక్కుల నీటి విడుదల

తాడేపల్లి టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగు తోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 1,15,971 క్యూసెక్కుల వరద నీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 1,03,350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 7,431 క్యూసె క్కులు, పశ్చిమ డెల్టాకు 5,009 క్యూసెక్కులు, గుంటూరు చానల్ కాలువకు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు




సాగర్‌లో 4 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో అధికారులు మంగళవారం నాలుగు క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయ నీటిమట్టం 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7,190 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,657 క్యూసెక్కులు, 4 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 32,316 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 84,403 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 84,403 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

టెయిల్‌పాండ్ నుంచి 69,616 క్యూసెక్కుల నీటి విడుదల

రెంటచింతల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ నుంచి 69,616 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. టెయిల్‌పాండ్‌కు చెందిన 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 4 గేట్లను 2.5 మీటర్లు, ఒక గేట్‌ను 2 మీటర్ల మేర ఎత్తి 61,196 క్యూసెక్కులు.. విద్యుదుత్పత్తి అనంతరం టెయిల్ రేస్ చానల్ ద్వారా 8,420 క్యూసెక్కులు మొత్తంగా 69,616 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేసినట్లు వారు చెప్పారు. సోమవారం వరకు రెండు యూనిట్ల ద్వారా 0.9988 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు. ఎగువన ఉన్న సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 66,014 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని చెప్పారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమని తెలిపారు.

టెయిల్‌రేస్ చానల్ ద్వారా విడుదలవుతున్న నీరు



దేశంలో జీఎస్‌టీ సంస్కరణలు విప్లవాత్మకం

● మాజీ కమిషనర్ జాన్సన్



మాట్లాడుతున్న ఆదాయపు పన్ను మాజీ కమిషనర్ జాన్సన్

ఏఎన్‌యూ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత ఆర్థిక వ్యవస్థలో జీఎస్‌టీ సంస్కరణలు విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చాయని తమిళనాడు మాజీ ఆదాయపు పన్ను కమిషనర్ జాన్సన్ వెల్లడించారు. ఏఎన్‌యూ వాణిజ్య, వ్యాపార నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో జీఎస్‌టీ 2.0- సూపర్ జీఎస్‌టీ- సూపర్ సేవింగ్స్ అనే అంశంపై మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాన్సన్ మాట్లాడుతూ భారత పన్ను వ్యవస్థ చారిత్రాత్మక పరిణామమని, ప్రాచీన వాణిజ్య సుంకాల నుంచి ఆధునిక జీఎస్‌టీ పన్ను నిర్మాణాలు ఎంతో కీలకమని చెప్పారు. విద్యార్థులు పన్ను విధానం గురించి అవగాహన పెంచుకోవాలని వివరించారు. జీఎస్‌టీ పన్ను విధానం పారదర్శకతతో పాటు సరళీకృత ఆదాయ సామర్థ్యాన్ని పెంచుతుందని అన్నారు. డిజిటలైజేషన్ పన్ను విధానం పరిపాలనలో కీలక మార్పులను తీసుకువచ్చిం దని జాన్సన్ పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఏఎన్‌యూ తాత్కాలిక రెక్టార్ ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు పన్ను విధానంలోని పరిణామాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ బలోపేతానికి కృషి

● డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ నర్సింగ్ సైలానీ



ఎన్‌సీసీ క్యాడెట్లతో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ నర్సింగ్ సైలానీ తదితరులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎన్‌సీసీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఏపి, తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ నర్సింగ్ సైలానీ అన్నారు. గుంటూరు 10 ఆంధ్ర బాలికల బెటాలియన్‌ను గుంటూరు కల్నల్ సుదాన్షు దుబేతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సైలానీ మాట్లాడుతూ, విద్యార్థుల్లో జాతీయత భావాన్ని, దేశం పట్ల గౌరవాన్ని పెంపొందించేందుకు ఎన్‌సీసీ తోడ్పాటునందిస్తుందన్నారు. ఎన్‌సీసీలో చేరేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. అనంతరం జాతీయ స్థాయి శిబిరాల్లో అవార్డు గెలుచుకున్న క్యాడెట్లను ఆయన కలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ కాలేజ్ ఫర్ ఉమెన్, ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల, గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలల బాలికల ఎన్‌సీసీ క్యాడెట్లు, కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ ఎస్వీఎస్ సుదర్శన్, ఏవో పట్వార్ పాల్గొన్నారు.

ఎవరయ్యేనో కోటీశ్వరులు..!

● అభివృద్ధిలో ప్రత్యేకత చాటితే రూ. కోటి నజరానా

● గ్రామ పంచాయతీలకు కేంద్రం ఆఫర్



సత్తెనపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిని సారించాయి. తాను నిర్దేశించిన తొమ్మిది అంశాల్లో పురోగతి సాధించిన పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నజరానాను ప్రకటించింది. స్థానిక అవసరాలు, భౌగోళిక అంశాలకు తగ్గట్టుగా పంచాయతీలు ప్రత్యేకతను చాటుకోవటం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన తొమ్మిది అంశాలను పరిగణనలోకి తీసుకొని పంచాయతీలకు పురస్కారాలు ప్రకటించనున్నారు. ప్రభుత్వ మార్గనిర్దేశాల మేరకు పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధిని డాక్యుమెంటరీ రూపంలో చిత్రీకరించి జిల్లా పంచాయతీ అధికారికి అందజేయాలి. వీటిని డీపీవో కార్యాలయ అధికారులు పరిశీలించి ఉత్తమమైనవిగా ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అధికారులు డిసెంబరులో పురోగతి, సూచిక ప్రగతిని గుర్తించి ప్రోత్సాహకానికి ఎంపికైన పంచాయతీలను ప్రకటిస్తారు. ఆయా పంచా యతీలకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నజరానాను అందజేస్తుంది.

తొమ్మిది అంశాలు ఇవే...

పంచాయతీల్లో ఏఏ అంశాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేయాలో కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. అవి గ్రామ పంచాయతీలో పేదరికం లేని జీవనోపాధి కల్పన, ప్రజారోగ్యం, శ్రేయస్సును మెరుగు పరిచే కార్యక్రమాలు నిర్వహించటం, పిల్లల సంరక్షణ, అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించటం, ప్రజలకు స్వచ్ఛమైన నీటిని పుష్కలంగా అందుబాటులోకి తేవటం, గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంగా ఉంచటం, మౌలిక సదుపాయల అభివృద్ధి, గ్రామంలో సామాజిక న్యాయానికి సురక్షిత వాతావరణం నెలకొల్పటం, శాంతియుతమైన న్యాయమైన బలమైన సంస్థలతో సుపరిపాలన, పంచాయతీ సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయలు, విద్యా ఆరోగ్యం తదితర అంశాలు ఉన్నాయి. ఈ తొమ్మిది అంశాల్లో గ్రామాలను అభివృద్ధి పరిచేందుకు వీలుగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుంది. పల్నాడు జిల్లాలో 329 పంచాయతీలు ఉండగా, వీటిని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు ప్రత్యేకంగా ప్రణాళికను సిద్ధం చేశాయి. పంచాయతీలను ప్రగతిలో పథంలో నడిపేందుకు జిల్లా పంచాయతీ అధికారులు మండలాల్లో ఈవోపీఆర్‌డీలకు ఆదేశాలిస్తూ అమలుకు సన్నాహాలు చేస్తున్నారు.

వర్సిటీలో ఘనంగా హస్తకళల ప్రదర్శన

ఏఎన్‌యూ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హస్తకళలు ప్రాచీన వారసత్వానికి నిదర్శనమని ఏఎన్‌యూ ఫైన్ ఆర్ట్స్ విభాగం సహాయక సమన్వయకర్త డాక్టర్ దేవకాంత్ అన్నారు. మంగళవారం ప్రపంచ హస్తకళల దినోత్సవం సందర్భంగా ఏఎన్‌యూలోని లలిత కళల విభాగం ఆధ్వర్యంలో హస్తకళలతో కూడిన ప్రదర్శన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవకాంత్ మాట్లాడుతూ హస్తకళలు భారత ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటుతో పాటు సృజనాత్మకతను జోడించాయన్నారు. అనంతరం విద్యార్థులు కొండపల్లి, ఏటికొప్పాక, చెన్న పట్నం, పిచ్‌వాయి బొమ్మలు, మంగళగిరి, ధర్మవరం, కలంకారి చేనేత వస్త్రాలతో కూడిన హస్తకళల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్య క్రమంలో అధ్యాపకులు బి.జాన్ రత్నబాబు, శేఖర్‌బాబు, వీరయ్యతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



హస్తకళల ప్రదర్శనలో విద్యార్థులు

వాటర్ షెడ్ పథకంతో

భూగర్భ జలాల పెంపు

● అమలు చేసేందుకు డ్వామా ప్రణాళికలు సిద్ధం

వినుకొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చాలా మండలాల్లో వందల అడుగుల లోతునకు బోర్లు తవ్వి నీరు తోడేస్తుండటంతో పాటు చెరువులు, కుంటల్లో పూడిక చేరి నీటి నిల్వకు అవకాశం లేకుండా పోయింది. దాంతో భూగర్భ జలమట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. అటువంటి చోట్ల వాటర్ షెడ్డు పథకం అమలు చేసేందుకు డ్వామా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల వృద్ధి, నేల కోత నివారణ ఉపాధి అవకాశాలు పెంపు లక్ష్యాలతో వాటర్ షెడ్ పథకం రూపకల్పన చేసింది. దీని కోసం జల సంరక్షణకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కృషి సంచాయి నిధులను కేటాయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి డ్వామా జిల్లా ప్రాజెక్టు సంచాలకుల ద్వారా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖకు పంపించామని అధికారులు తెలిపారు.

ఊట చెరువులు, రాక్ ఫిల్ డ్యామ్‌ల నిర్మాణం

వాటర్ షెడ్ పథకంలో భాగంగా వాగుల ప్రవాహ మార్గాలు, పరివాహక ప్రాంతాలలో చెక్ డ్యాములు, ఊట చెరువులు, పెర్కులేషన్ ట్యాంకులు, రాక్ ఫిల్ డ్యాములు నిర్మిస్తారు. ప్రతి నీటి బొట్టు వృథా కాకుండా నిల్వచేసి వినియోగంలోకి తెచ్చేందుకు ఇవి దోహదపడ తాయి. వినుకొండ నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలంలో ఈ సంవత్సరం మార్చిలోనే బోర్లు ఎండిపోయాయి. దీంతో తాగునీటి ఎద్దడి ఏర్పడటంతో ప్రభుత్వం 16 ఆవాస ప్రాంతాలకు మూడు నెలలపాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి వచ్చింది. భూగర్భ జలాలు పరిమితికి మించి వినియోగించడంతో అక్కడ బోర్ల తవ్వకాలు నిషేధించారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాం 2014-19 కాలంలో జిల్లాలో వాటర్ షెడ్ పథకం అమలు చేశారు. ఆ సమయంలో బొల్లాపల్లి మండలం రేమిడిచర్లలో 50 లక్షలతో చెరువులు కుంటలు ఆర్ఎఫ్‌టీలు నిర్మించారు. వాటిల్లో వాన నీరు చేరి డిసెంబరు వరకు నీరు ఉండేది. దీంతో ఆయా చుట్టుపక్కల బోర్లు అదనంగా మరో మూడు నెలలు పనిచేశాయని గ్రామస్థులు తెలి పారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంతో పాటు భూగర్భ జలాలు అడుగంటిన జిల్లాలోని పలు మండలాల్లో వాటర్‌షెడ్ పథకాన్ని అమలు చే సేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.



బొల్లాపల్లి మండలంలోని ఊటకుంట

జిల్లాలో గుర్తించిన మండలాలు..

అచ్చంపేట, బెల్లంకొండ, బొల్లాపల్లి, ఈపూరు, దుర్గి, కారంపూడి, మాచర్ల, రాజుపాలెం, వెల్దుర్తి, మాచవరం, పిడుగురాళ్ల, నకరికల్లు మొత్తం 12 మండలాలు గుర్తించగా ఈ మండలాల పరిధిలో 73 పంచాయితీలు 113 గ్రామాలు ఉన్నాయి.